
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



'మార్గదర్శి'లో సీఐడీ సోదాలు

పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మార్గదర్శి చిట్‌ఫండ్ బ్రాంచ్ కార్యాలయాలను సీఐడీ అధికారులు గురువారం తనిఖీ చేశారు. - 8లో▸



డెల్టా కాలువలకు నీరు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

పాఠశాలలకు వరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన బడి నాడు-నేడు మాదిరిగానే, ఇప్పుడు కేంద్రం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం-శ్రీ) పథకాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. - 8లో▸

కొబ్బరి డీలా.. అరటి అధరేలా...



రావులపాలెం మార్కెట్ యార్డులో ఎగుమతులకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు

- రావులపాలెం అరటి మార్కెట్ జోరు
- పెరిగిన ధరలతో రైతులకు ఊరట
- అంబాజీపేట కొబ్బరి మార్కెట్ బేజారు
- ఆశించిన స్థాయిలో లేని ఎగుమతులు

సాక్షి అమలాపురం/ రావులపాలెం/ అంబాజీపేట: శ్రావణ మాసం వచ్చింది. వరుస శుభ ముహూర్తాలు... పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, మరోవైపు వరలక్ష్మీ పూజలు, గ్రామాల్లో అమ్మవారి జాతరలు తెచ్చింది. ఈ సందడి వినాయక చవితి వరకూ ఉంటోంది. దీనివల్ల జిల్లాలోని అతి పెద్ద మార్కెట్లయిన రావులపాలెం అరటి, అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ఊపందుకుంటోంది. ఈ సమయంలో ఏటా అరటి, కొబ్బరి ధర పెరుగుతోంది. ప్రస్తుతం రావులపాలెం అరటి మార్కెట్‌లో ఎగుమతులు జోరందుకుని ధరలు పెరిగినా.. అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎగుమతులు, ధరలు లేక రైతులు డీలా పడుతున్నారు.

అదిరేటి ధర

రావులపాలెం మార్కెట్‌లో అరటి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. నైరుతిలో వర్షాలు పడకపోవడానికి తోడు గత నెలలో వరదలతో లంక గ్రామాల్లో అరటి పంటలకు నష్టం వాటిల్లడంతో గెలల ధరలు ఆకాశాన్నంటాయి. దిగుబడి తగ్గడంతో పాటు శ్రావణ మాసం, శుభ కార్యక్రమాల వల్ల రేటు పెరగడానికి కారణమైంది. కర్పూరం రకం గెల ధర రూ.600 వరకూ పలుకుతుండటం విశేషం. వారం రోజుల కిందటి వరకూ అంతంత మాత్రంగా ఉన్న అరటి ధర ఒక్కసారిగా పెరిగింది. వారం కిందట గెల రూ. 100 నుంచి రూ.250 ఉండేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.600 వరకూ పలుకుతోంది. దీనితో పాటు చక్కెర కేళి, ఎరుపు చక్కెర కేళి, అమృతపాణి, బొంత అరటి ధరలు కూడా పెరిగాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అరటి పంట దిగుబడి తగ్గింది. రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా దిగుబడులు లేదు. ఇదే ఊపు దసరా వరకూ మరో నెలా పదిహేను రోజుల పాటు ఉండొచ్చని అరటి వ్యాపారి కోనాల చంద్రశేఖర్‌రెడ్డి 'సాక్షి'కి వివరించారు.



రైతుల వద్ద పేరుకుపోయిన కొబ్బరి రాశులు

నిరాశే మిగిలింది

సాధారణంగా శ్రావణ మాసంలో ఎగుమతులు జోరందుకుని, ధరలు పెరిగే కొబ్బరి ఈ సారి నిరాశ మిగిల్చింది. శ్రావణానికి తోడు ప్రభుత్వం త్వరలోనే నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయినా కొబ్బరి ధరలు పెరగలేదు. ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అనుకున్న స్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణం. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి రోజుకు 30 లారీల మించి కూడా కొబ్బరి రవాణా జరగడం లేదు. సాధారణ రోజుల్లో రోజుకు సగటున 75 లారీల కొబ్బరి ఎగుమతి కాగా, శ్రావణం సీజన్‌లో ఇది 125 లారీల వరకూ ఉంటోంది. ప్రస్తుత అంబాజీపేట మార్కెట్‌లో పచ్చికొబ్బరి వెయ్యి కాయల ధర రూ.7 వేల నుంచి రూ.7,400 వరకూ ఉంది. ముక్కుడు కాయ రూ.6,800 నుంచి రూ.7.200 వరకూ పలుకుతుంది. మిగిలిన ప్రాంతాల్లో ఈ ధర మరింత తక్కువ. దీనితో పాటు కొత్త కొబ్బరి (తయారీ కొబ్బరి, ఎండు కొబ్బరి) క్వింటాలు ధర రూ.8,200 వరకూ ఉండగా, కురిడీ కాయలో పాతరకంలో గండేరా రకం వెయ్యికాయల ధర రూ.12 వేలు, గటగట రకం రూ.10 వేలు, కొత్తరకంలో గండేరా రూ.11 వేలు, గటగట రూ.9 వేలు మాత్రమే ఉంది. ఆరు నెలలుగా కొబ్బరి ధరలు పెద్దగా పెరగడం లేదు. మరోవైపు తెల్లదోమ ఉధృతి వల్ల 30 శాతం దిగుబడి తగ్గింది. దీనికితోడు మిగిలిన దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి ఉత్తరాదికి ఎగుమతుల కారణంగా స్థానిక కొబ్బరికి ధర లేకుండా పోయింది. ఒకవైపు దిగుబడి, మరోవైపు ధర లేక కొబ్బరి రైతులు దిగాలు చెందుతున్నారు.

రావులపాలెం మార్కెట్‌లో ధరలు

అరటి రకం	వారం కిందట గెల ధర రూ. (కనిష్ట... గరిష్ట)	ప్రస్తుతం (కనిష్ట... గరిష్ట)
కర్పూరం	100 నుంచి 200	150 నుంచి 600
అమృతపాణి	110 నుంచి 200	200 నుంచి 600
చక్కెరకేళి	150 నుంచి 250	200 నుంచి 600
ఎరుపు చక్కెరకేళి	150 నుంచి 350	250 నుంచి 700
బొంత అరటి	80 నుంచి 150	150 నుంచి 300

అస్సలు ఊహించలేదు



వారంలో అరటి గెలలకు ఈ స్థాయిలో ధర వస్తోందని అస్సలు ఊహించలేదు. దిగుబడి తగ్గడం వల్లే ధరలు ఇంత పెరిగాయి. నేను ఐదున్నర ఎకరాల్లో కర్పూరం అరటి పండిస్తున్నాను. ప్రస్తుతం కొద్దిగా గెలలు వస్తున్నాయి. ఇదే ఊపు కొనసాగితే గట్టెక్కుతాం.

– శీలం వెంకటరమణ, అరటి రైతు, రావులపాడు, రావులపాలెం మండలం

ఏడు నెలలుగా ఇంతే..



కొబ్బరి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ధర లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. ఏడు నెలలుగా కొబ్బరి ధరలు పెరిగిన దాఖలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొబ్బరి దింపులు తీసేందుకు కూలి ఖర్చులు కూడా రావడం లేదు. శ్రావణ మాసంలోనైనా ధరలు పెరుగుతాయనుకున్నా నిరాశే మిగిలింది.

– గుత్తుల శ్రీనివాస్, రైతు, అయినాలవారిపాలెం, పి.గన్నవరం

న్యూస్‌రీల్

వీరేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్లలోని **భద్రకాళీ సమేత** వీరేశ్వరస్వామి ఆలయంలో **గురువారం హుండీల** లెక్కింపు ద్వారా రూ.19,99,654 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ ఆవరణలో చైర్మన్ పెన్మత్స వాసురాజు, దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు సమక్షంలో ఈ లెక్కింపు జరిగింది. కట్న కానుకల హుండీ ద్వారా రూ.10,73,229, ప్రధాన హుండీ ద్వారా రూ.7,98,372, అన్నదాన హుండీ నుంచి రూ.1,28,053 సమకూరింది. ఈ లెక్కింపులో అంబాజీపేట శ్రీనివాస సేవా సమితి, అమలాపురం భీమేశ్వర సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, పాలకమండలి సభ్యులు ఉన్నారు.

'అక్షయ పాత్ర'కు రూ.80 వేల విరాళాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థకు భక్తులు రూ.80 వేలను విరాళాలుగా గురువారం అందజేశారు. విద్యుత్‌నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా జరిగిన ధూమ్ర వారాహి హోమంలో ఆ దాతలు పాల్గొని ఈ విరాళాలను సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన లీల రాజకోటేశ్వరరావు, లక్ష్మీ శిరీష, చంద్రమల్లిక, కృతిరాజ్‌లు రూ.60 వేలు, జాస్తి భూపాల్ రూ.20 వేలను అక్షయ పాత్ర అధ్యక్షుడు పోతుల రామకృష్ణారావుకు ఇచ్చారు. అనంతరం భక్తుడు అరిగెల వెంకట నాగేశ్వరరావు (బుజ్జి) దంపతులు కర్తలుగా హోమాన్ని నిర్వహించారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిర్మాణాలను పూర్తి చేయించి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు, 4జీ మొబైల్ టవర్లకు భూసేకరణ, జగనన్న పాల వెల్లువ, చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం, గృహ నిర్మాణం తదితర కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ శుక్లా జిల్లా అధికారులతో మాట్లాడుతూ రీసర్వేను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. గోదావరి వరదల కారణంగా నష్టపోయిన ఉద్యాన పంటల అంచనాలను రూపొందించాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారుల సొంతింటి కలను సాకారం చేయాలన్నారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ సీహెచ్ బాబూరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, సర్వే ఏడీ ప్రభాకర్ రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్‌లో సాంకేతిక లోపం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా రాకపోకల సాగించే విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం(20833/34)వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో దాని స్థానంలో మరో ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. విశాఖపట్నం నుంచి బయలుదేరాల్సిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గుర్తించిన అధికారులు మరో రైలును ఏర్పాటు చేశారు. గురువారం రాజమహేంద్రవరం నుంచి 150 మంది ప్రయాణికులు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేయించుకున్నారు. రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ పొందిన వారికి పూర్తి సొమ్ము తిరిగి ఇచ్చేందుకు ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికులకు సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు. వందే భారత్ రైలు రద్దు కావడంతో కొద్ది మంది తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. అయితే 15 మంది ప్రయాణించేందుకు సిద్ధం కావడంతో వారిని వందే భారత్ రైలు స్థానంలో ఏర్పాటు చేసిన మరో రైలులో ఎక్కించి పంపినట్టు రాజమహేంద్రవరం రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం నుంచి వందే భారత్ రైలు యథావిధిగా తిరగనుందని ఉన్నతాధికారులు తెలియజేశారన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు రె'ఢీ'

- అమలాపురంలో నేటి నుంచి నిర్వహణ
- హాజరు కానున్న 200 మంది క్రీడాకారులు



అమలాపురంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సిద్ధమైన కోర్టు

అమలాపురం టౌన్: స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సాధనాల వాసు మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించేందుకు అంతా సిద్ధమైంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే మొత్తం 200 మంది క్రీడాకారులు అమలాపురం చేరుకున్నారు. పోటీల కోసం అమలాపురం ఆఫీసర్స్ క్లబ్ ఇన్‌డోర్ స్టేడియంలో వేదిక (కోర్టు)ను సకల సౌకర్యాలతో సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం పది గంటలకు పోటీలను కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించనున్నారు. కోనసీమ స్పోర్ట్స్ ప్రతినిధి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ వంటి ప్రముఖులు ఈ ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. అమలాపురం నుంచి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా ఎదిగి భారత దేశానికి ఎన్నో పతకాలు తెచ్చిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ స్ఫూర్తితో కోనసీమ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, పోటీల నిర్వాహకులు అల్లాడ శరత్, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ తెలిపారు. దీనికి భారత బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తో పాటు ఆయన జోడి చిరాగ్ శెట్టిలను కూడా ఆహ్వానించామన్నారు. అమలాపురం చేరుకున్న క్రీడాకారులకు వసతితో పాటు కోనసీమ మర్యాదలకు, రుచులకు ఏ మాత్రం తీసిపోకుండా భోజన ఏర్పాట్లు చేస్తున్నామని వారు వివరించారు. రెండు దశాబ్దాల తర్వాత రూ. పది లక్షలతో ఈ పోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు శరత్, కాశీ విశ్వనాథ్ వివరించారు.

22న ముఖ్యమంత్రి జగన్ రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

- నిడదవోలులో వైఎస్సార్ కాపునేస్తం కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం
- సభావేదిక, హెలిపాడ్, రూట్ మ్యాప్ పరిశీలన
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్

నిడదవోలు: పట్టణంలో ఈ నెల 22న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. నిడదవోలులోని సెయింట్ అంబ్రోస్ స్కూల్ ఆవరణలో సభావేదిక స్థలం, రైల్వేగేటు సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్మించనున్న హెలిపాడ్‌ను, రూట్ మ్యాప్‌ను స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, అదనపు ఎస్పీ ఎం.రజనీతో కలసి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత గురువారం పరిశీలించారు. వైఎస్సార్ కాపునేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేయడానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిడదవోలు వస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ మాధవీలత అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఇతర శాఖల అధికారులకు చేయవలసిన పనులపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు ఎం.గంగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోనసీమలో రేపే ఉప ఎన్నికలు

ఒక సర్పంచ్, ఆరు వార్డు స్థానాలకు నిర్వహణ



కృష్ణకుమారి, జిల్లా పంచాయతీ అధికారి

అమలాపురం రూరల్: కోనసీమలో ఖాళీ అయిన సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. శనివారం ఆరు వార్డు స్థానాలతో పాటు రామచంద్రపురం మండలం ఓదురు సర్పంచ్ ఎన్నికలకు పోలింగ్ యథావిధిగా జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి గురువారం తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరం 13వ వార్డు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి 3వ వార్డు, మండపేట మండలం తాపేశ్వరం 14వ వార్డు, ఆత్రేయపురం మండలం ర్యాలి 1వ వార్డు, అల్లవరం మండలం కొమరగిరిపట్నం 4వ వార్డు, రావులపాలెం మండలం ఊబలంక 3వ వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. అమలాపురం రూరల్ ఈదరపల్లి ఐదో వార్డు, పాలగుమ్మి ఆరో వార్డు, ఉప్పలగుప్తం మండలం కూనవరం ఏడో వార్డు, పి.గన్నవరం మండలం కుందలపల్లి ఏడో వార్డు, ముంగండపాలెం పదో వార్డు, కాట్రేనికోన మండలం బంటుమిల్లి మూడో వార్డు, కాట్రేనికోన 5, 6 వార్డులు, కుప్పిగుంట పదో వార్డు, రాజోలు మండలం మెరకపాలెం పదో వార్డు, మలికిపురం మండలం పడమటిపాలెం ఐదో వార్డు, కపిలేశ్వరపురం మండలం టేకి 8వ వార్డు, మండపేట మండలం ఏడిద ఒకటో వార్డు, ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి ఆరో వార్డు, బొబ్బర్లంక పదో వార్డులకు, అల్లవరం మండలం గోడిలంక సర్పంచ్ పదవులకు ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న విజయరామ్

అమలాపురం రూరల్: గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని ప్రకృతి వ్యవసాయ సాధకుడు, ప్రచారకుడు విజయరామ్ అన్నారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించుకోవడానికి అంతా మొక్కల పెంపకానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బ్యాంకు బ్యాలెన్స్‌కు కాకుండా నేచర్ బ్యాలెన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫైవ్ లేయర్ మెథడ్ ద్వారా కేవలం 400 గజాల స్థలంలో ప్రతి ఇంటికి కావాల్సిన ఉప్పు తప్ప అన్ని రకాల పంటలు పండించుకోవచ్చని అన్నారు. పక్షుల ఆవాసాలైన తాటిచెట్లను నరికి వేయొద్దని తెలిపారు. పాలిథిన్ సంచులతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, తక్షణమే వాటిని మానివేయాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వందలాది మంది రైతులు తరలివచ్చారు. బ్యాక్ టు రూట్స్ యూట్యూబ్ ఛానల్ శ్రీనివాస్‌రెడ్డి, దేశీ విత్తనాల ప్రచారకర్త రఘువీర్, డాక్టర్ మాధవరావు, సత్యనారాయణ, రైతులు గోపాలకృష్ణ, వంకా నరసింహారావు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

అమలాపురం టౌన్: పట్టణంలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఆంక్షలు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉంటాయని డీఎస్పీ ఎం .అంబికా ప్రసాద్ వెల్లడించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్న దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆటోలు, కార్లు, లారీలు, బస్సులు, ఇతర వాహనాలను పట్టణంలోకి అనుమతించేది లేదని చెప్పారు.

- ముమ్మిడివరం వైపు నుంచి అమలాపురం మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు ముమ్మిడివరం కొండాలమ్మ చింత మీదుగా క్రాప, కె.జగన్నాథపురం, తొత్తరమూడి, ముక్తేశ్వరం, మడిపల్లి నుంచి వెళ్లాలి.
- ముమ్మిడివరం, ఉప్పలగుప్తం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు అనాతవరం, మాగం, సిరిపల్లి, ముక్తేశ్వరం, అయినవిల్లి, మడుపల్లి మీదుగా పయనించాలి.
- కాకినాడ నుంచి అమలాపురం మీదుగా రాజోలు వెళ్లే వాహనాలు భట్నవిల్లి 216 బైపాస్ రోడ్డు మీదుగా పేరూరు వై.జంక్షన్ నుంచి వెళ్లాలి.
- రాజోలు నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు పేరూరు వై.జంక్షన్ నుంచి 216 బైపాస్ రోడ్డు మీదుగా భట్నవిల్లి చేరుకుని కాకినాడకు సాగాలి.
- రాజోలు, నగరం నుంచి అమలాపురం మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు బోడసకుర్రు వంతెన, తోట్లపాలెం, వాకలగరువు, నందంపూడి అంబాజీపేట మీదుగా రాకపోకలు సాగించాలి.
- అమలాపురం నుంచి అంబాజీపేట, రావులపాలెం వెళ్లే టూ వీలర్లు, ఆటోలు ఎత్తురోడ్డు, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, ఇందుపల్లి వంతెన మీదుగా వెళ్లాలి.
- అమలాపురం నుంచి ముక్కామల, రావులపాలెం వెళ్లే టూ వీలర్లు, ఆటోలు అమలాపురం నల్లవంతెన, జనుపల్లి, నేదునూరు, ముక్కామల లేదా నల్ల వంతెన కాల్వ గట్టు మీదుగా నడిపూడి లాకుల నుంచి రాకపోకలు సాగించాలి.
- అమలాపురం ఎర్ర వంతెన మీదుగా పేరూరు వై.జంక్షన్‌కు వెళ్లే టూ వీలర్లు, ఆటోలు ఎర్ర వంతెన, విత్తనాల వారి కాల్వగట్టు, వడ్డిగూడెం, గోఖిలే సెంటర్ మీదుగా వెళ్లాలి.

సత్య విదియ వేడుకలు ప్రారంభం

ఆయుష్య హోమానికి అంకురార్పణ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని 133వ సత్య విదియ (ఆవిర్భావ) వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయంలో పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యావాహచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి జయంతి వేడుకలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పట్టువస్త్రాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఈ వేడుకల్లో రెండ్రోజులు జపతపాలు నిర్వహించే 40 మంది రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ అందజేశారు.

ఘనంగా జన్మ నక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారి మూలవిరాట్‌లకు, శివలింగానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు

మంత్రోచ్చారణతో మార్మోగిన రత్నగిరి

స్వామివారి జయంతి వేడుకలను పురస్కరించుకుని రుత్విక్కుల మంత్రోచ్చారణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనివేటి మంటపంలో సుమారు వంద మంది రుత్విక్కులు జపాలు, పారాయణలు, తర్పణాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, లింగాష్టకం, నవావరణ అర్చన, రామాయణ, భాగవతాల పారాయణ, శ్రీసూక్త, పురుష సూక్త పారాయణ, బాల, కౌమారీ, సువాసినీ పూజలు నిర్వహించారు. సాయంత్రం దర్బారు మంటపంలో కలశ స్థాపన ఆయుష్య హోమానికి అంకురార్పణ నిర్వహించారు. ఆస్థాన వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక అభిషేకాలు, పూజలు

శుక్రవారం సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వర్ణాభరణాలు, నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజలు చేస్తారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 11 గంటలకు అనివేటి మంటపంలో ఆయుష్యహోమం పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం వెండి రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తారు. సత్యదేవుడు, అమ్మవారిని గరుడ వాహనంపై సాయంత్రం 5-30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. సత్యదేవుని జయంత్యుత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలు, పూలమాలలతో ముస్తాబు చేశారు.

క్లుప్తంగా

తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు



రావులపాలెం నుంచి అరుణాచలం బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు (ఫైల్)


కొత్తపేట: శ్రావణమాసం పూర్ణిమ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ విశిష్టతను దృష్టిలో పెట్టుకుని అక్కడికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్ సర్వీసు నడుపుతున్నామన్నారు. అరుణాచలం– తిరుపతి యాత్ర ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకూ ఉంటుందని అన్నారు. ఈ నాలుగు రోజుల యాత్రలో తిరుపతి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ క్షేత్రాలను దర్శనం చేయిస్తారన్నారు. ఈ యాత్రకు సంబంధించి సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ఏర్పాటు చేశామని, టిక్కెట్ ధర రూ 3,400గా నిర్ణయించామని వివరించారు. అలాగే ఇదే డిపో నుంచి అరుణాచలం– రామేశ్వరం ఏడు రోజు తీర్థయాత్రకు మరో సర్వీసు నడుపుతున్నామని కుమార్ తెలిపారు. ఇందులో కాణిపాకం, కాంచీపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వర్, మధురై, రామేశ్వరం, ధనుష్కోటి, తంజావూరు, స్వామిమలై, కుంభకోణం, తిరువారూర్, తిరుకాడియూర్, చిదంబరం, శ్రీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌కు టిక్కెట్ (భోజనంతో సహా) రూ.8,030 అని తెలిపారు. అకామిడేషన్ ఖర్చులు ఎవరికి వారే భరించాలన్నారు. బస్సుకు సరిపడా భక్తులు ఉంటే కోరిన ప్రదేశానికి బస్సును నేరుగా కూడా పంపిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలు, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులను పునరుద్ధీకరణ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులో మాట్లాడుతూ 2022 – 23 విద్యాసంవత్సరంలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులన్నారు. ఒప్పంద అధ్యాపకులు ఈనెల 18వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సంబంధిత దరఖాస్తులను ఆర్ట్స్ కళాశాలలో అందజేయాలన్నారు. ఈనెల 23న కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ జరుతుందన్నారు.

పాఠశాలలకు వరం

- రెండో దశ పీఎం–శ్రీకి దరఖాస్తుల ఆహ్వానం
- కోనసీమ జిల్లాలో 410 పాఠశాలలకు అర్హత
- ఎంపికైన వాటికి కేంద్రం సహకారం
- యూడైస్ 2021-22 ప్రామాణికం



పీఎం–శ్రీ మొదటి దశలో ఎంపికైన సమనస రెసిడెన్షియల్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

రాయవరం: మన బడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాలలను భౌతికంగా అభివృద్ధి చేయడంతో పాటు, విద్యాపరంగా గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన బడి నాడు–నేడు మాదిరిగానే, ఇప్పుడు కేంద్రం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–శ్రీ) పథకాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు హై క్వాలిటీ విద్యను అందించనున్నారు. యూడైస్ 2021-22 ద్వారా విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ఈ పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థుల సమగ్ర ప్రగతే లక్ష్యంగా.. వాటికి నేరుగా నిధులు అందజేసే పీఎం–శ్రీ పథకం తొలి విడతకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 21 పాఠశాలలు ఎంపికయ్యాయి. జిల్లా స్థాయిలో ఈ పథకానికి జిల్లా విద్యాశాఖాధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

ఎంపిక చేస్తారిలా..

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల నిర్వహణలోని అన్ని పాఠశాలలూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఆయా పాఠశాలలే నిర్దేశిత ఫార్మాట్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్ చేసి, కార్యకలాపాలను సమీక్షిస్తారు. ఈ పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయిన సమయంలో మాత్రమే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పక్కా భవనం, బాలురకు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఆటస్థలం తదితర కొన్ని వసతులు ఆయా పాఠశాలల్లో కచ్చితంగా ఉండాలి. పీఎం–శ్రీలో ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు చేపట్టాల్సిన పనులపై జిల్లా విద్యాశాఖాధికారులకు ఇప్పటికే వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

విడతల వారీగా నిధులు

పీఎం–శ్రీ పథకంలో దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను నిపుణుల కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన పాఠశాలలకు విడతల వారీగా నేరుగా నిధులు అందజేస్తారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలను ఆయా పాఠశాలలు సమకూర్చుకోవచ్చు. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఎంపికైన పాఠశాలలకు ఐదేళ్ల వరకూ ఆర్థిక, సాంకేతిక సహకారం లభిస్తాయి. ఎంపికైన పాఠశాలలను పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ స్కూల్స్‌గా మార్చాల్సి ఉంటుంది. పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లు, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించాలి. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యర్థాల నిర్వహణ వంటివి చేయాల్సి ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాల్సి ఉంటుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

పీఎం–శ్రీ పథకం రెండో దశ కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 410 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తుకు అర్హత సాధించాయి. వీటిలో 304 ప్రాథమిక, 31 ప్రాథమికోన్నత, 75 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి 368, పట్టణ ప్రాంతం నుంచి 42 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం వచ్చే మార్కుల ఆధారంగా ఆయా పాఠశాలలకు పీఎం–శ్రీ పథకానికి ఎంపికవుతాయి.

దరఖాస్తు చేయాలిలా..

- స్టెప్–1లో భాగంగా పాఠశాలల రిజిస్ట్రేషన్ చేయాలి.
- స్టెప్–2లో పరిశీలన ప్రక్రియ ఉంటుంది. హెచ్‌ఎం లాగిన్‌లో పీఎం–శ్రీ పోర్టల్ నమోదు చేసిన వెంటనే ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దాని ద్వారా లాగిన్ అయిన తర్వాత అందులో పేర్కొన్న 42 అంశాలను పూర్తి చేయాలి.
- వీటితో పాటు హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, విద్యార్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలి.
- తర్వాత కేంద్ర విద్యా శాఖ ఆయా పాఠశాలలకు మార్కులు వేస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం, పట్టణాల్లోని పాఠశాలలు 70 శాతం మార్కులు సాధిస్తే ఈ పథకానికి అర్హత పొందుతాయి.
- ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.

వేగవంతం చేయాలి



పీఎం–శ్రీ పథకంలో రెండో దశకు ఎంపికైన పాఠశాలల జాబితాను ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించాం. పీఎం–శ్రీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే వెబెక్స్ నిర్వహించాం. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో పాఠశాలలు దరఖాస్తు చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలి.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

పంచాయతీ చట్టాలపై అవగాహన అవసరం



మాస్టర్ ట్రైనీల శిక్షణలో మాట్లాడుతున్న మేనేజర్ శ్రీనివాసరావు

సామర్లకోట: పంచాయతీ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాల్లో మాస్టర్ ట్రైనీలకు రెండు రోజుల శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాస్టర్ ట్రైనీలు పంచాయతీ చట్టాలు, నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందన్నారు. ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, కేఎస్ఆర్ నిహారిక పాల్గొన్నారు.

డ్వామా అధికారులకు శిక్షణ

స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పని చేస్తున్న డ్వామా ఏపీఓ, ఏపీఎంలకు మూడో బ్యాచ్‌లో మూడు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈటీసీ మేనేజర్, సీనియర్ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాలు తయారీ, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ, మేట్ల పనితీరు, ఉపాధి హామీలో ఇప్పటి వరకు జరిగిన పనిలో లోపాలను గుర్తించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

మాయగాళ్ల వల.. అప్పులతో విలవిల

- రొయ్యల వ్యాపారి ఆత్మహత్యకు ఇదే కారణం
- నకిలీ దస్తావేజులు సృష్టించి మోసం
- ఇద్దరు కీలక నిందితుల అరెస్ట్

అమలాపురం టౌన్: మాయగాళ్ల వలలో చిక్కుకున్న ఓ రొయ్యల వ్యాపారి చివరికి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమలాపురంలో ఇటీవల కలకలం రేపింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను అమలాపురం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 1న అమలాపురం ఎర్ర వంతెన సమీపంలోని శ్రీనివాస ఫుడ్స్ యజమాని బాలం శ్రీనివాసరావు (47) తన షాపులోనే ఆత్యహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. నకిలీ డాక్యుమెంట్లతో తనను కొందరు మోసం చేశారని, రూ.47 లక్షల వరకూ కాజేశారని సెల్ఫీ వీడియో తీసుకుని నిందితుల పేర్లు చెప్పి మరీ శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కేసును డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి అధ్వర్యంలో పట్టణ ఎస్సై జి.హరీష్ కుమార్ లోతుగా దర్యాప్తు చేశారు. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన బ్యాంకుల్లో రుణాలు ఇప్పించే అడపా దుర్గా సత్యపవన్, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్ మురమళ్ల వీరశివారెడ్డి నాయుడు ప్రధానంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రొయ్యల వ్యాపారి శ్రీనివాసరావు నుంచి రూ.47 లక్షల వరకూ కాజేసి రూ.కోటి రుణం ఇప్పిస్తామని మోసం చేశారు. చివరకు వీరి వేధింపులు తాళలేక, అప్పుల బాధ తట్టుకోలేక శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది.

ఎలా మోసగించారంటే..

అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితుల్లో ఒకడైన వీరశివారెడ్డి నాయుడు ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో పదెకరాల భూములకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూమిని మృతుడు శ్రీనివాసరావుకు అంటగట్టారు. అప్పటికే శ్రీనివాసరావు నుంచి వీరు పలు దఫాలుగా రూ.47 లక్షలు కాజేశారు. భూముల డాక్యుమెంట్ల ద్వారా రూ.కోటి రుణం బ్యాంక్‌లో ఇప్పిస్తామని శ్రీనివాసరావును ఊరిస్తూ అందుకు కొంత ఖర్చు అవుతుందని, ఇంకా డబ్బులు తేవాలని వేధించసాగారు. వీరి ఇప్పించే బ్యాంక్ రుణాన్ని నమ్ముకుని రైతుల నుంచి రొయ్యలను ఎక్కువగా కొనుగోలు చేసి వారికి డబ్బులు సరిపెట్టలేక అప్పుల పాలయ్యాడు. రూ.47 లక్షలు పోగొట్టుకోవడం, నకిలీ డాక్యుమెంట్లతో భూములను అంటగట్టడం, అప్పుల పాలై పోవడం, ఆ ఇద్దరి వేధింపులు భరించలేక ఆత్మహత్యే శరణ్యమని శ్రీనివాసరావు ప్రాణాలు తీసుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. కీలక నిందితులైన దుర్గా సత్యపవన్, వీరశివారెడ్డి నాయుడికి కోర్టు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని, వారి కోసం గాలిస్తున్నామన్నారు.

'మార్గదర్శి'లో సీఐడీ సోదాలు

రాత్రి వరకూ సాగిన తనిఖీలు



సామర్లకోట మార్గదర్శి కార్యాలయంలో సోదాలు చేస్తున్న సీఐడీ అధికారులు



అమలాపురం మార్గదర్శి చిట్ ఫండ్ బ్రాంచ్ రికార్డులను తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

అమలాపురం టౌన్ /సామర్లకోట: పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మార్గదర్శి చిట్‌ఫండ్ బ్రాంచ్ కార్యాలయాలను సీఐడీ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ సంస్థ బ్రాంచ్‌లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ అధికారులు సోదాలు చేశారు. కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెచ్చిన రికార్డుల ద్వారా ఇక్కడి అన్ని రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రాజమహేంద్రవరం నుంచి వచ్చిన సీఐడీ అధికారులకు రిజిస్ట్రార్, రెవెన్యూ, ఇంటిలిజెన్స్ అధికారులు సహాయ సహకారాలు అందించారు. బ్రాంచ్‌లో డిపాజిట్‌దారుల జాబితాను పరిశీలించారు. కొంత మంది డిపాజిట్‌దారులకు సీఐడీ అధికారులు ఫోన్ చేసి డిపాజిట్ వివరాలు అడిగి తెలుసుకుని వారిని పలు ప్రశ్నలు వేశారు. బ్రాంచ్ అధికారులు బయటకు వెళ్లనీయకుండా రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో సీఐడీకి చెందిన ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం కూడా సోదాలు కొనసాగే అవకాశం ఉందని తెలిసింది. సీఐడీ సోదాలు జరుగుతున్నంత సేపూ బయట వ్యక్తులెవరినీ లోనికి అనుమతించ లేదు. మొత్తం బ్రాంచ్ లావాదేవీలు స్తంభింపజేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట బ్రాంచ్‌లో కూడా సీబీసీఐడీ, కమర్షియల్ ట్యాక్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సాయంత్రం వరకూ తనిఖీలు చేశారు. రాజమహేంద్రవరంలోని మార్గదర్శి కార్యాలయంలో అర్ధరాత్రి వరకూ సోదాలు జరిగాయి.

కాకినాడ క్రైం: కాకినాడ దేవాలయం వీధిలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయంలో సీఐడీ సోదాలు నిర్వహించింది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇది జరిగింది. కాకినాడలో సీఐడీ డీఎస్పీ పెంటారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. తాజా తనిఖీలలో ఖాతాదారుల వివరాలతో పాటు గడచిన పదేళ్లుగా సేకరించిన డిపాజిట్ల నిర్వహణను పరిశీలించారు. వన్ టౌన్ పోలీసుల భద్రత నడుమ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సోదాలు రాత్రి వరకూ సాగాయి. బ్రాంచ్‌లోని ఖాతాల నిర్వహణకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లతో పాటు రెండు కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. సోదాల క్రమంలో సిబ్బందిని కార్యాలయంలోనే ఉంచి, తనిఖీ పూర్తయ్యే వరకూ చరవాణిలను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బ్లేడ్‌తో గాయపరిచిన వ్యక్తికి జైలు

గోకవరం: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని బ్లేడ్‌తో గాయపరిచిన నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన బదిరెడ్డి దుర్గాప్రసాద్‌పై అదే ప్రాంతానికి చెందిన సింగవరపు యేసుప్రసాద్ 2018లో పాతకక్షల నేపథ్యంలో బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. ఈ కేసుపై రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో విచారణ నిర్వహించగా యేసుప్రసాద్ నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు.

తెలుగు వైభవం చాటుదాం..

- 'నన్నయ' ఉపకులపతి పద్మరాజు
- ముగిసిన సహస్రాబ్ది ఉత్సవాలు



నన్నయ నందంపూడి శాసనం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఆదికవి నన్నయ పేరుతో ఏర్పడిన యూనివర్సిటీలో తెలుగు భాష, సాహిత్య వైభవం చాటేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. స్థానిక యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో కేంద్ర సాహిత్య అకాడమీతో కలసి రెండు రోజుల పాటు నిర్వహించిన 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు' గురువారంతో వైభవంగా ముగిశాయి. ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మీనరసింహమూర్తి మాట్లాడుతూ నన్నయ సాహిత్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో భావితరాలకు అందించాలని సూచించారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజింగ్‌కి, సాహిత్య పరిశోధనలకు ఆకాశం హద్దు కాదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ జాతీయ సదస్సు ప్రతిపాదనను అంగీకరించి, విజయవంతం చేయడంలో సహకరించిన కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధులను అభినందించారు.

పత్రాల సమర్పణ

రెండో రోజు సదస్సులో నన్నయ భారతంపై పలువురు సాహిత్యవేత్తలు పత్రాలను సమర్పించారు. ఉదయం తెలుగు, ప్రాకృత, సంస్కృత పండితుడు బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'నన్నయ భారతం– భాషా వైభవం' అనే అంశంపై బూదాటి వెంకటేశ్వర్లు, నన్నయ కథకథన శిల్పంపై విస్తాలి శంకరరావు, నన్నయ భారతం– ప్రతి నాయకుల చిత్రణపై సీహెచ్ లక్ష్మణచక్రవర్తి పత్ర సమర్పణ చేశారు. తరువాత బూదాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 'నన్నయ భారతం– పద్యశిల్పం'పై పేరి రవికుమార్, నన్నయ భారతంలో కనిపించే చాళుక్యశైలిపై శీలం శ్రీనివాసరావు, నన్నయ వర్ణించిన పండిత సభలు అనే అంశంపై కేవీఎన్‌డీ వరప్రసాద్ పత్రాలు సమర్పించారు. అలాగే రంకిరెడ్డి రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన చివరి కార్యక్రమంలో 'నన్నయ ప్రకృతి వర్ణనలు అనే అంశంపై గరిమెళ్ల సత్యశేషగిరి సోమయాజి, నన్నయపై పరిశోధనలపై వెలుదండ నిత్యానందరావు, నన్నయ కథ కథన శిల్పంపై సి.మృణాళిని పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పత్ర సమర్పకులను ఉపకులపతి ఆచార్య పద్మరాజు అభినందించి, జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం నన్నయ నందంపూడి శాసనం బ్రోచర్‌ను సభాముఖంగా ఆవిష్కరించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కేవీఎన్‌డీ ప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో దొంతరాజు లక్ష్మీనరసమ్మతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయోద్యమంపై 29, 30 తేదీల్లో సదస్సులు

ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం కృషి' అనే అంశంపై ఈ నెల 29, 30 తేదీలో జాతీయ సదస్సు నిర్వహించనున్నామని అకాడమీ, తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే ఈ సదస్సులో రచయితలు జాతీయోద్యమంపై రచించిన నవలు, గేయాలు, కవితలు, కథలు, నాటకాలు, పాటలు తదితర వాటిపై వక్తలు విశ్లేషిస్తారన్నారు. చంద్రయాన్ 3 ల్యాడర్ ఈ నెల 23న సాయంత్రం చంద్రునిపై దిగుతుందని ఇస్రో శాస్త్రవేత్త రేమిళ్ల లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు. చంద్రునిపై ల్యాడర్ దిగిన తరువాత దాని నుంచి బయటకు వచ్చి 14 రోజులు సంచరిస్తుందన్నారు.

అన్నవరం దేవస్థానానికి బస్సు బహూకరణ



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరే, రోహిత్, ఈఓ అజాద్

అన్నవరం: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడంలో భారతీయ స్టేట్‌బ్యాంక్ గణనీయమైన పాత్ర పోషిస్తుందని ఆ బ్యాంకు చైర్మన్ దినేష్ ఖరే అన్నారు. తమ బ్యాంకు 63 దేశాల్లో 30 వేల స్టేట్ బ్యాంకు బ్రాంచ్‌లను కలిగి ఉందన్నారు. గురువారం ఆయన సతీసమేతంగా అన్నవరంలోని రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించారు. తరువాత బ్యాంకు సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా అన్నవరం దేవస్థానానికి రూ.30 లక్షల విలువ చేసే 32 సీటెడ్ బస్సును అందజేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో కలసి ఆ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ మాట్లాడుతూ సత్యదేవుని భక్తుల సౌకర్యార్థం గతేడాది రెండు బ్యాటరీ కార్లు అందజేశామన్నారు. తాజాగా బస్సును సమకూర్చాలమన్నారు. పారిశ్రామిక వేత్తలు, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతలు మట్టే సత్యప్రసాద్, శ్రీనివాస్, సీజీఎం నవీన్ చంద్ర ఝూ, డీజీఎం ఎస్.ప్రమోద్ కుమార్, ఆర్ఎం సురేష్ బాబు, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ రఘురామ్ పాల్గొన్నారు. దేవస్థానానికి బస్సు బహూకరించాలని దినేష్ ఖరేను దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌లు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.